www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 2 అక్టోబర్ 2024

5

తిరుపతి



రేపటి నుంచి దసరా సెలవులు

ప్రజాశక్తి - తిరుపతి: విద్యార్థులకు రేపటి నుంచి దసరా సెలవులు ఇస్తున్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. అకడమిక్ క్యాలెండర్ షెడ్యూల్‌లో పేర్కొన్న తేదీ కంటే ముందే దసరా సెలవులను ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కీలక ప్రకటన చేశారు. ఈనెల 3వ తేదీ నుంచే దసరా సెలవులు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. 13వ తేదీతో సెలవులు ముగియనున్నాయి. 14వ తేదీన తిరిగి విద్యా సంస్థలు పునఃప్రారంభం కానున్నాయి. ఏపీలో రేపటి నుంచి దసరా సెలవులు ప్రారంభమవుతాయని, ఈ నెల 13 వరకు సెలవులు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నెల 14న పాఠశాలల పునః ప్రారంభం ఉంటుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

మద్యం షాపులు 'బంద్'

- 876 మంది ఇంటిబాట
- కాంట్రాక్టు ఉద్యోగుల ఆందోళన
- తమిళనాడుకు మద్యం ప్రియులు క్యూ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీని తీసుకురావడంతో జిల్లాలో 876 మంది కాంట్రాక్టు ఉద్యోగులు ఇంటిబాట పట్టారు. తమకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ సంస్థల్లో అవకాశం కల్పించాలంటూ రాష్ట్రవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ బేవరేజస్ కార్పొరేషన్ కాంట్రాక్టు ఉద్యోగులు షాపులకు బీగాలు వేసి ఆందోళన బాట పట్టారు. మందుబాబులకు ముందస్తు సమాచారం లేకపోవడంతో 'బార్' బాట పట్టారు. తిరుపతి జిల్లావ్యాప్తంగా కొన్నిచోట్ల నిరసనలు జరిగాయి. దీంతో ఎక్సైజ్ శాఖ జోక్యం చేసుకుని సాయంత్రం 6 గంటలకు బీగాలను పగలగొట్టి ఎక్సైజ్ పోలీసులే మద్యాన్ని విక్రయించడం గమనార్హం. మరికొన్నిచోట్ల సమీప తమిళనాడు రాష్ట్రానికి స్కూటర్లలో మద్యం ప్రియులు క్యూ కట్టారు.

తిరుపతి జిల్లావ్యాప్తంగా 11 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో ప్రభుత్వ బ్రాందీషాపులు 218 ఉన్నాయి. సేల్స్ సూపర్‌వైజర్లు, సూపర్‌వైజర్లు, వాచ్‌మెన్లు ఒక్కో షాపులో నలుగురు చొప్పున పనిచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీని తీసుకొస్తామని చెబుతూ ప్రభుత్వ పర్యవేక్షణలో ప్రైవేట్ షాపులకు తెరదీసింది. కలెక్టర్ వెంకటేశ్వర్ నూతన మద్యం పాలసీ విధానాన్ని మీడియాకు వివరించారు. ఐదేళ్లుగా ఇదే జీవనంగా గడుపుతున్న కాంట్రాక్టు ఉద్యోగులు ప్రత్యామ్నాయ ఉద్యోగాలను చూపించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. నిరసనలు తెలియజేస్తూనే ఉన్నారు. అయితే ప్రభుత్వం పట్టించుకోకుండా అక్టోబర్ 12 నుంచి కొత్త పాలసీని అమలు చేయనుంది. దీంతో తమ పరిస్థితి ఏంటంటూ రాష్ట్రవ్యాప్తంగా బ్రాందీషాపుల్లో పనిచేస్తున్న వారు ఆందోళనకు దిగారు.

– సూళ్లూరుపేటలోని మద్యం షాపుల్లో పనిచేసిన ఔట్‌సోర్సింగ్ కార్మికులు మంగళవారం నిరసన చేశారు. పెండింగ్ జీతాలు ఇవ్వకపోగా, కనీస ఉద్యోగ భద్రత లేకుండా ఇంటికి పంపడం అన్యాయమని వాపోయారు. నూతన షాపులు వస్తే తమ బతుకులు ఏంటని ప్రశ్నిస్తున్నారు. అయితే ముందస్తు సమాచారం లేకుండా మద్యం షాపులు మూతబడడంతో ద్విచక్రవాహనాల్లో సమీప తమిళనాడు వైన్‌షాపులకు స్కూటర్లలో వెళ్లి తెచ్చుకోవడం కనిపించింది. – కోటలో సిబ్బంది నిరసన తెలిపారు. ఐదేళ్లుగా తమకు కనీస వేతనం ఇవ్వకుండా, పిఎఫ్, ఇఎస్ఐలతో సహా ఓటులు చేయించుకుని ఏజెన్సీలుత ఇనేశాయన్నారు. దుకాణాలను ప్రైవేట్‌పరం చేసి తమను రోడ్డున పడేస్తోందన్నారు.

'కోట'లో మూతబడిన షాపు ఎదుట నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు ఉద్యోగులు

జిల్లావ్యాప్తంగా జాబితా

తిరుపతి అర్బన్ మున్సిపల్ కార్పొరేషన్ లో 32, తిరుపతి రూరల్ 12, బి.ఎన్ కండ్రిగ 5, శ్రీకాళహస్తి 12, నాయుడుపేట 13, కేవీబి పురం 3, తొట్టంబేడు 3, ఏర్పేడు 7, నాగలాపురం 4, పిచ్చటూరు 3, సత్యవేడు 10, వరదయ్యపాలెం 5, పుత్తూరు 7, నారాయణవనం 3, రామచంద్రపురం 4, వడమాల పేట 4, చంద్రగిరి మండలం 7, పాకాల మండలం 5, చిన్నగొట్టిగల్లు మండలం 3, ఎర్రావారిపాలెం మండలం 2, గూడూరు 12, చిల్లకూరు 6, ఓజిలి 2, సూళ్లూరుపేట 14, దొరవారి సత్రం 2, పెళ్లకూరు 2, తడ 5, వాకాడు 4, చిట్టమూరు 4, కోట 7, వెంకటగిరి 9, బాలయ్యపల్లి 3, డక్కిలి 3 కలిపి 227 ప్రభుత్వ మద్యం షాపులకు నోటిఫికేషన్ విడుదల అయ్యిందన్నారు. పదివేల జనాభా కలిగిన ప్రాంతంలో 50 లక్షల రూపాయలు, 50వేల జనాభా ఉన్న ప్రాంతాలలో 2024–25 గాను 55 లక్షల రూపాయలు, 2025–26 గాను 60 లక్షల 50 వేల రూపాయలు, 50 వేల నుండి 5 లక్షల జనాభా కలిగిన మున్సిపల్ కార్పొరేషన్, మండలాల పరిధిలో 2024–25 గాను 65 లక్షలు, 2025–26 గాను 71 లక్షల 50వేల రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. డిప్ ద్వారా మద్యం షాపు పొందిన వారు ఆరు వాయిదాల పద్ధతులు చెల్లించే వెసులుబాటును నూతన మద్యం పాలసీలో రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ నిర్వహించిన సమావేశంలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి నాగమల్లేశ్వర రెడ్డి, అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి శ్రీనివాసచారి పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో నూతన మద్యం పాలసీని వివరిస్తున్న కలెక్టర్

'ఓపెన్ ఫర్ ఆల్'

- నోటిఫికేషన్ విడుదల
- పారదర్శక పాలసీ : కలెక్టర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా విడుదల చేసిన మద్యం పాలసీ పారదర్శకమైనదని, ఎటువంటి అనుమానాలకు తావు లేకుండా ఈ పాలసీని రూపొందించడం జరిగిందని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్లో కలెక్టర్ ఛాంబర్ లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలు, వివిధ ప్రాంతాలను కలుపుకొని రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 210ను విడుదల చేసిందని, 227 మద్యం షాపులకు ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ గెజెట్ 113 ను విడుదల చేసిందన్నారు. ఔత్సాహికులు 2 లక్షల రూపాయలు దరఖాస్తు రుసుముగా చెల్లించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 11 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో ఈ దరఖాస్తులు ఆన్ లైన్, ఆఫ్ లైన్, హైబ్రిడ్ ఇలా మూడు పద్ధతుల ద్వారా స్వీకరిస్తామన్నారు.

తిరుపతిలో ఇవీ నిబంధనలు

తిరుమలలో ఉన్న ఎక్సైజ్ స్టేషన్ నుండి ఎటువంటి దరఖాస్తులు స్వీకరించబడవన్నారు. తిరుపతి జిల్లా కేంద్రం తిరుపతిలో రైల్వే స్టేషన్ నుండి అలిపిరి వరకు ఉన్న ప్రధాన మార్గాలు లీలామహల్ కూడలి, కపిలతీర్థం ప్రాంతాలలో ఎటువంటి మద్యం షాపులను ఏర్పాటు చేయడానికి వీలు లేదన్నారు. అలానే ఆలయాలు, పాఠశాలలకు వంద మీటర్ల సమీపంలో ఎటువంటి మద్యం షాపులను ఏర్పాటు చేయడానికి వీలు లేదన్నారు. ఒకటో తేదీ నుండి తొమ్మిదో తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. 11వ తేదీ ఉదయం 8 గంటలకు తిరుపతి శిల్పారామంలో జిల్లావ్యాప్తంగా ఎంపిక చేయబడిన 227 షాపులకు లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేస్తామన్నారు. అదేరోజు సాయంత్రం ఎంపిక చేయబడ్డ షాపుల లైసెన్సుదారులను ప్రకటిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నూతన మద్యం పాలసీని రెండు సంవత్సరాలకు గాను 12.10.2024 నుంచి 30.09.2026 వరకు కాల పరిమితి ఉంటుందన్నారు.

నేడు నిరసన దీక్ష : ఐద్వా

తిరుపతి టౌన్ : నూతన మద్యం పాలసీని వ్యతిరేకిస్తూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో అక్టోబర్ 2న బుధవారం గాంధీ విగ్రహాల ముందు నిరసన దీక్షలు చేపట్టాలని జిల్లా కార్యదర్శి పి.సాయిలక్ష్మి పిలుపునిచ్చారు. అత్యధిక సంఖ్యలో మద్యం షాపులు కేటాయించి ప్రజలను మత్తులో ముంచడం సరైంది కాదన్నారు. నాణ్యమైన మద్యం అంటే మహిళలపై హింస జరగకుండా, మహిళల అక్రమ రవాణా జరగకుండా, ప్రమాదాలను నివారించే మద్యాన్ని సరఫరా చేస్తారా? అంటూ ఎద్దేవా చేశారు. తిరుపతిని మద్యరహిత ప్రాంతంగా ప్రకటించాలన్నారు.

జిల్లాలో 2,66,342 మందికి

రూ.112.71కోట్లు పంపిణీ: కలెక్టర్

పింఛన్ పంపిణీ తీరును పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం ఉదయం 6 గంటల నుంచి ప్రారంభించి, జిల్లాలో 2,66,342 మందికి సచివాలయ సిబ్బంది ద్వారా రూ.112.71 కోట్లు పంపిణీ చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. తిరుపతి పట్టణంలోని అక్కారంపల్లి, సుబ్బారెడ్డి నగర్‌లో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నగరపాలక సంస్థ కమిషనర్ నారపరెడ్డి మౌర్య పాల్గొన్నారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రతినెలా సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇంటి వద్దకే వచ్చి పంపిణీ చేస్తున్నారా.. లేదా.. అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వృద్ధాప్యం, వితంతు, చేనేత, కల్లుగీత కార్మికులు, ఒంటరి మహిళలకు, మత్స్యకారులకు, కుష్టు వ్యాధి గ్రస్తులకు, చర్మకారులకు, హిజ్రాలకు, డప్పు కళాకారులకు పెంచిన ఫించన్లు అందజేసినట్లు తెలిపారు. ప్రతి నెలా 1 వ తేదీన ప్రతి ఒక్క సచివాలయ ఉద్యోగి తమ పరిధిలోని లబ్ధిదారులకు వంద శాతం పింఛన్ పంపిణీ చేయాలని తెలిపారు. ఏదైనా కారణం చేత పెన్షన్లు నేడు తీసుకోలేని వారికి ఈనెల 3వ తేదీన పంపిణీ చేయడం జరుగుతుందని, తప్పకుండా వారు వారి ఇంటి వద్ద అందుబాటులో ఉండాలని కలెక్టర్ తెలిపారు.

డీజీపీని కలిసిన జిల్లా ప్రజారవాణా అధికారి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతి జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం తిరుమలకు చేరుకున్న రాష్ట్ర డిజిపి, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ ద్వారకా తిరుమలరావును తిరుపతి జిల్లా ప్రజారవాణా అధికారి టీ.చెంగల్ రెడ్డి మర్యాదపూర్వంగా కలిశారు. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా విచ్చేసే భక్తులకు ప్రతిరోజు లక్ష 20 వేల మందికి రవాణా సౌకర్యాలు సిద్ధం చేశామని, గరుడసేవ రోజు రెండు లక్షల 80 వేల మందికి సౌకర్యమంతమైన ప్రయాణ సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాటు చేశామని వివరించారు.

పక్కాగా పారిశుధ్య పనులు : కమిషనర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: నగరపాలక సంస్థ పరిధిలోని రైల్వేస్టేషన్, విష్ణు నివాసం, కోనేటి కట్ట, ఆర్టీసీ బస్టాండు తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం పారిశుధ్య పనులను కమిషనర్ ఎన్.మౌర్య పరిశీలించారు. పలు దుకాణాలు ముందర చెత్త వేస్తుండడం, మురుగు కాలవలో చెత్త బ్లాక్ అయి రోడ్లపై నీరు రోడ్లపైకి వస్తుండడాన్ని గుర్తించి దుకాణదారులను మందలించారు. కమిషనర్ మాట్లాడుతూ తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారని, ఈ ప్రాంతాల్లో పక్కాగా పారిశుధ్య పనులు జరగాలని అధికారులను ఆదేశించారు. చెత్తతో నిండిపోయిన, బ్లాక్ అయిన మురుగునీటి కాలువలను వెంటనే మరమ్మతులు చేసి రోడ్లపైకి నీరు రాకుండా చూడాలన్నారు. అక్కడక్కడ రోడ్ల పైన ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఇంజనీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్వైజర్ సుమతి ఉన్నారు.

శివయ్య ఆస్తులకు రక్షణ కల్పిస్తా : ఈవో

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శివయ్య ఆస్తులు, భూముల పరిరక్షణకు కంకణబద్ధులమై ఉన్నామని శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో చంద్రశేఖర్ ఆజాద్ అన్నారు. మంగళవారం ఆయన తమిళనాడు రాష్ట్రంలోని పొన్నేరు గ్రామంలో ఉన్న ముక్కంటి భూములను పరిశీలించారు. రికార్డులను, హద్దులను తనిఖీ చేశారు. ముక్కంటి భూములు అన్యాక్రాంతం కాకుండా ఆలయాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

'విశాఖ ఉక్కు' ప్రైవేటీకరణ వెంటనే ఆపాలి

విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో రిలే నిరసన దీక్షలు

దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు జయచంద్ర

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తిరుపతిలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన దీక్షలను ప్రారంభించడం జరిగింది. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కత్తి రవి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి అధ్యక్షతన దీక్షలను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి చలపతి, డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు జయచంద్ర మాట్లాడుతూ ఏళ్లతరబడి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని ఉద్యమం చేపడుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం కూడా స్పందించకపోవడం బాధాకరమన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం ఈ రాష్ట్రంలో ఉన్న కంపెనీలను, ఫ్యాక్టరీలను అంబానీ, అదాని చేతులకు అప్పజెప్పేందుకు సిద్ధమైందని విమర్శించారు. గతంలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం, ప్రస్తుత అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం కూడా ఢిల్లీలో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని దీక్షలు చేస్తే దానిలో పాల్గొని ఉపన్యాసాలు ఇవ్వడం తప్ప కేంద్ర ప్రభుత్వాన్ని ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేస్తే పెద్దఎత్తున ఉద్యమిస్తామని అనేక హామీలు ఇచ్చి తిరుపతి లడ్డు కల్తీ విషయంలో దీక్షలు చేస్తున్నారు గాని విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ విషయంలో ఎందుకు దీక్షలు చేయలేదని, కేంద్ర ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తే కొన్ని వేలమంది కార్మికులు ఉద్యోగాలు కోల్పోయి వాళ్ళ కుటుంబాలు రోడ్డున పడాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం జనసేన ప్రభుత్వాలు కూడా కేంద్ర ప్రభుత్వాన్ని విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ విషయంలో ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రతిపక్షంలో ఉన్న వైఎస్సార్‌సిపీ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపైన తమ వైఖరిని ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపకపోతే కేంద్ర ప్రభుత్వం పైన విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. దీక్షలలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉదయ్, రాష్ట్ర గర్ల్స్ కోకన్వీనర్ చిన్నం ప్రీతి, పిడిఎస్ఓ జిల్లా కార్యదర్శి ఆశ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు నవీన్, రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అక్బర్, నాయకులు అశోక్, వినోద్, తేజ, బాల, నాయకులు వేణు, బుజ్జి పాల్గొన్నారు.

ఏచూరి బాటలో నడుద్దాం.. ఎమ్మెల్యే గాలి

ప్రజాశక్తి- పుత్తూరు టౌన్

సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి బాటలో నడుద్దాం.. దేశాభివృద్ధికి కృషి చేద్దామని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. మంగళవారం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో ఏచూరి సంస్మరణ సభ సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు హాజరై సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళి అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏచూరి దేశాభివృద్ధికి కీలకపాత్ర పోషించారని, ప్రజలు, శ్రామికుల సమస్యలపై పోరాడుతూ కష్టజీవులకు అండగా నిలిచి పలు ఉద్యమాలు చేశారని అన్నారు. వందవాసి నాగరాజు మాట్లాడుతూ ఏచూరి విద్యార్థి దశ నుంచి అనేక ప్రజాపోరాటాలకు నాంది పలికారని, ఎమర్జెన్సీ కాలంలో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ ప్రశ్నించిన గొప్ప నాయకుడని కొనియాడారు. విశాఖ ఉక్కు పై పార్లమెంట్‌లో అధికార పక్షాన్ని నిలదీశారని, యుపిఏ ప్రభుత్వ ఏర్పాటుకు కీలక పాత్ర పోషించారని కొనియాడారు. అటువంటి వ్యక్తి మరణం పార్టీకి తీరని లోటు అని అన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు చిన్నబాబు, జెడ్‌పిటిసి మురళీధర్ రెడ్డి, గంజి మాధవయ్య, ఏలుమలై, అమ్ములు, కరుణ యాదవ్, సిపిఎం నాయకులు పి.భాస్కర్, ఎ.విజయ్, ఎ.శివ, బాష, రమేష్, కెఆర్. సుబ్రహ్మణ్యం పిళ్లై, నరసింహులు, సుబ్రహ్మణ్యం, దేవా, సతీష్ కుమార్, సురేష్, ముఖేష్ కుమార్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత: కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: మన చుట్టూ ఉన్న పరిసరాలను, గ్రామాలను, పట్టణాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ఇది ప్రతిఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం కలెక్టర్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ ఎన్.మౌర్యతో కలిసి పారిశుధ్య డ్రైవ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గాంధీ జయంతిని పురస్కరించుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల మేరకు అన్నిరంగాల వారిని, స్టేక్ హోల్డర్స్‌ను భాగస్వామ్యులను చేసుకుంటూ స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు ప్రతి సంవత్సరం నిర్వహించుకోడవం జరుగుతుందని తెలిపారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా నేడు తిరుపతి నియోజకవర్గంలో వినాయకసాగర్ చుట్టూ తిరుపతి ఎంఎల్‌ఏ, మున్సిపల్ కమీషనర్‌తో కలిసి వాకర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో మునిసిపల్ కార్పొరేషన్ వారి సహకారంతో ఒక పారిశుధ్య డ్రైవ్‌ను, అవగాహన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలోభాగంగా నిర్వహించిన పలు పోటీల్లో పాల్గొని గెలుపొందిన చిన్నారులు, యువతకు బుధవారం మున్సిపల్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో కచ్చపి ఆడిటోరియంలో బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే రూరల్ పరిధిలో డిపిఓ ఆధ్వర్యంలో పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారందరికీ కార్డులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ అదనపు కమిషనర్ చరణ్ తేజ్‌రెడ్డి, డిప్యూటి కమిషనర్ అమరయ్య, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ అన్వేష్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న కలెక్టర్, ఎమ్మెల్యే, కమిషనర్

డిప్యూటీ సిఎంకు ఘన స్వాగతం

రేణిగుంట ఎయిర్‌పోర్టులో డిప్యూటీ సిఎంకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- రేణిగుంట: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పంచాయతీ రాజ్, అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తిరుపతి జిల్లాలో మూడు రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న వీరికి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జిల్లా అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి అలిపిరి శ్రీవారి పాదాల మెట్ల మార్గం చేరుకున్నారు. రాత్రి 8 గంటలకు తిరుమల చేరుకుని రాత్రికి బస చేస్తారు. 2వ తేదీ ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారు. అనంతరం 11.05 గంటలకు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రాన్ని తనిఖీ చేస్తారు. బుధవారం రాత్రి తిరుమలలో బస చేస్తారు. 3వ తేదీ సాయంత్రం 4.30 గంటలకు తిరుమల నుండి బయలుదేరి తిరుపతిలో జరగనున్న వారాహి సభలో పాల్గొని రాత్రి 8.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని విజయవాడ తిరుగుప్రయాణం కానున్నారు.

నేలపట్టు పక్షుల కేంద్రం పునఃప్రారంభం

ప్రజాశక్తి - దొరవారిసత్రం:

మండల పరిధిలోని నేలపట్టు ప్రముఖ పక్షుల పర్యాటక కేంద్రం మంగళవారం పునః ప్రారంభించి పర్యాటకులకు ఆహ్వానం పలుకుతున్నట్లు ఎఫ్ఆర్ఓ నరసింహరావు మంగళవారం విలేకర్ల సమావేశంలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ గత 5 మాసాలుగా పక్షులు పర్యాటక కేంద్రంలో లేకపోవడంతో 5నెలల పాటు ప్రధాన ప్రవేశ ద్వారానికి తాళం వేశారు. అక్టోబర్ మాసంలో విదేశీ పక్షులు విడిదికి రానుండడంతో దీనిని దృష్టిలో పెట్టుకుని పర్యాటకుల సందర్శనార్థం మంగళవారం మూసిన గేట్లను తిరిగి తెరిచారు. పర్యాటకుల కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసి టికెట్ కౌంటర్‌ను కూడా ప్రారంభించారు. ఎఫ్ఎస్ఓ బాలయ్య, టూరిస్ట్ గైడ్ హుస్సేన్, టికెట్ కౌంటర్ ఇంచార్జ్ వేణు పాల్గొన్నారు.

గరుడ సేవ ఏర్పాట్లపై ఈవో సమీక్ష

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈనెల 8వ తేదీన జరిగే గరుడసేవకు లక్షలాదిగా విచ్చేసే భక్తులపై ప్రత్యేక దృష్టి సారించి ఏర్పాట్లు చేయాలని టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. తిరుమల గోకులం విశ్రాంతి భవనంలో మంగళవారం సాయంత్రం అదనపు ఈవో గరుడ సేవ ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా వాహనాల ముందు ప్రదర్శించే వివిధ రాష్ట్రాలకు చెందిన సాంస్కృతిక బృందాల ప్రదర్శనలకు సంబంధించిన వీడియోను అదనపు ఈఓ పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. నాలుగు మాడ వీధులలో అన్న ప్రసాద వితరణకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను అధ్యయనం చేశారు. ఇందులో అన్నప్రసాదాల తయారీ, పంపిణీ మార్గాలు, గ్యాలరీలలో ఉన్న భక్తులకు సజావుగా అన్నప్రసాదాలు పంపిణీ అయ్యేలా ఇతర విభాగాలతో సమన్వయం చేయడంపై చర్చించారు. సమావేశంలో రవాణా శాఖ జిఎం శేషారెడ్డి, డిప్యూటీ ఈవోలు రాజేంద్ర, ఆశాజ్యోతి, హెచ్‌డీపీపీ , విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిటిడి ఈవో

క్రీడల్లో బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి - సత్యవేడు: ఇటీవల నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ లో సత్తాచాటిన సత్యవేడు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో సత్తా చాటి ప్రథమ స్థానం సాధించారు. అండర్ 19 సాఫ్ట్ బాల్ పోటీలలో సత్యవేడు ప్రభుత్వ బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన దీపిక, పదవ తరగతి బాలిక జిల్లా స్థాయిలో మొదటి స్థానం దక్కించుకొని రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఈ విద్యార్థిని త్వరలో జరు రు లో రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరు కానుంది. అండర్ 14 లాంగ్ జంప్ జూనియర్ బాయ్స్ పోటీలల్లోనూ ఇదే పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి బి బాలాజీ జిల్లా స్థాయిలో4.85 మీటర్ల లాంగ్ జంప్ ను అధిగమించి ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపిక య్యాడు. ఇదే పాఠశాలకు చెందిన హిమ అండర్ 14 పోటీల్లో 30 కేజీల కరాటే పోటీలలో జిల్లా స్థాయిలో పట్టు సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. త్వరలో రాజంపేటలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. పాఠశాల విద్యార్థిని విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో సత్తా చాటడంపై ప్రధానోపాధ్యాయురాలు భారతి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేసి విజేతలకు అభినందనలు తెలిపారు.

మద్యం షాపుల సిబ్బంది నిరసన

ప్రజాశక్తి- బుచ్చి నాయుడు కండ్రిగ: గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రభుత్వ మద్యం దుకాణాలు మండలంలో ఐదు వున్నాయని వాటిలో 15 మంది సిబ్బంది పనిచేస్తున్నారని, ప్రస్తుత టిడిపి ప్రభుత్వం ఆ మద్యం షాపులను తొలగించి, ప్రైవేటుకు అప్పగించడాన్ని నిరసిస్తూ మద్యం షాపుల సిబ్బంది మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. షాపులు మూసివేస్తే తమ పరిస్థితి వీధిన పడే దుస్థితి నెలకొందని తమకు ప్రభుత్వం మరో మార్గం చూపాలని వారు కోరారు. 'జాబ్ తియ్యద్దు.. మా గొంతు కొయ్యదు..!' అనే నినాదాలు తో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 15 మంది సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం న్యూస్

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జరిమానా

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 15 మందికి 1లక్షా50 వేల రూపాయలు జరిమానా విధిస్తూ నాలుగవ అడిషనల్ జ్యుడీషియల్ జడ్జి మంగళవారం తీర్పు ఇచ్చారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసుల పని తీరును ఎస్‌పి ఎల్ సుబ్బరాయుడు అభినందించారు. తిరుపతి నగర ప్రజలకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా బాధ్యతతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

త్వరలో నూతన పింఛన్ల నమోదుకు అనుమతి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : త్వరలో రాష్ట్రంలో నూతన పింఛన్ల నమోదుకు అనుమతి ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక రాజీవ్‌నగర్ లో ఎమ్మెల్యే ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్ వ్యవస్థ లేకపోయినా సచివాలయ సిబ్బందితో పింఛన్లను సకాలంలో అందిస్తున్నామన్నారు. త్వరలో కొత్త పింఛన్ల నమోదుకు ప్రభుత్వం అనుమతి ఇస్తుందని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: ఎన్టీఆర్ భరోసా పింఛన్లను సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ 90 శాతం పూర్తయిందని ఎంపిడివో త్రివిక్రమరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 14 సచివాలయాల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: స్థానిక 22వ వార్డు ఎన్‌జిఓ కాలనీలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను వార్డు కౌన్సిలర్, పుత్తూరు పట్టణ టిడిపి అధ్యక్షుడు జి జీవరత్నం నాయుడు మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పుత్తూరు పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు ఆర్ మాధవ నాయుడు, వార్డు అధ్యక్షుడు కన్నన్, టిడిపి నాయకులు కుప్పయ్య, ప్రభాకర్ రెడ్డి, ఉదయ్, సచివాలయ సెక్రటరీలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

దొరవారిసత్రం: దొరవారిసత్రం మండల పరిధిలోని నెలబల్లి పంచాయతీలో ఎమ్మెల్యే విజయశ్రీ మంగళవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ వేమసాని శ్రీనివాసులు నాయుడు,ఎస్సీ సెల్ అధ్యక్షులు గోను జకరయ్య, నియోజకవర్గ మైనారిటీ నాయకుడు ఎస్ కె. షబ్బీర్, మాజీ సర్పంచ్ జాన్ రమేష్,భాస్కర్ రెడ్డి,రాజేంద్ర ప్రసాద్, ఉదయ్ కుమార్,రవీంద్ర నాయుడు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీలో మూడవ స్థానం

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: కర్నూలులో ఈ నెల 29వ తేదీ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీలో స్థానిక గీతాంజలి స్కూలు విద్యార్థులు మూడవ స్థానంలో నిలిచారని ఆ స్కూలు కరస్పాండెంట్ గిరికుమార్ రెడ్డి తెలిపారు. తమ స్కూలు జట్టు జిల్లా స్థాయిలో తిరుపతి జిల్లా తరపున ఫుట్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో ఆడేందుకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. కర్నూలులో రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో తమ విద్యార్థులు మూడవ స్థానంలో నిలవడం ఎంతో ఆనందంగా వుందన్నారు. ఈ విజయానికి కారణమైన వ్యాయామ ఉపాధ్యాయుడు బి కృష్ణమూర్తిని అభినందించారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీకి ఎంపికైన నెరబైలు విద్యార్థులు

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీకి నెరబైలు విద్యార్థులు

ప్రజాశక్తి- యర్రావారిపాలెం: మండలంలోని నెరబైలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు బాలికల విభాగంలో ఎస్‌జిఎఫ్ అండర్ 17 ఫుట్‌బాల్ జిల్లా సెలక్షన్స్‌లో నెరబైలు విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఉపాధ్యాయులు ముక్కు చంద్రశేఖరయ్య, గాజులు ప్రసాద్ తెలిపారు. సెప్టెంబర్ 18న మదనపల్లిలో జరిగిన ఫుట్‌బాల్ సెలక్షన్స్‌లో నెరబైలు పాఠశాలకు చెందిన బాలిక విభాగంలో టీమాధురి , ఎస్‌లలిత, ఏమౌనిక, వైవంశీ కళ్యాణ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనందుకు విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన టి మాధురి జమ్ము కాశ్మీర్ లో జరుగు జాతీయ స్థాయి పోటీకి ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. పోటీలలో ఎంపికైన విద్యార్థులకు ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపింది.

ముందస్తు దసరా వేడుకలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో మంగళవారం ముందస్తు దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినివిద్యార్థులు శరన్నవరాత్రుల్లో అమ్మవారి వేషధారణలో అందరిని అలరించారు. అనంతరం ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య మాట్లాడుతూ చెడుపై మంచి విజయం సాధించడానికి ప్రతీకగా దసరా ఉత్సవాలు నిర్వహిస్తారన్నారు. దుర్గాదేవి మహిషాసురుడనే రాక్షసుడిని వధించిన సందర్భంగా దేశమంతటా దసరా జరుపుకుంటారని గుర్తు చేశారు. అనంతరం విద్యార్థులకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఏజీఎం శ్రీనివాసులు, ఆర్ఐ సురేష్, ఉపాధ్యాయులు చూడామణి, లత, మల్లిక పాల్గొన్నారు.

స్వచ్ఛత హీ సేవలో ఐఐటి సిబ్బంది

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలంలోని చిందేపల్లి గ్రామ పంచాయతీలో ఏర్పేడు ఐఐటి బృందం సర్పంచ్ చెన్నూరు పెంచలయ్య ఆధ్వర్యంలో స్వచ్ఛతహి సేవను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐఐటి డైరెక్టర్ కెఎన్ సత్యనారాయణ విచ్చేసి ఇరిగేషన్ కాలువలలో ప్లాస్టిక్ వ్యర్థాలను, పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం ప్రతి ఒక్కరూ వారానికి రెండు గంటలు బాధ్యత వహించి పరిసరాలను శుభ్రపరచుకోవాలని ప్రతిజ్ఞ చేపట్టారు.

అధికారులు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని తహశీల్దారు కార్యాలయంలో పలు అధికారులు మంగళవారం నూతనంగా బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఎక్కడ డీటీగా పనిచేసిన మల్లికార్జున రావును సివిల్ సప్లై డిటిగా నియమించారు. ఆయన స్థానంలో చిల్లకూరు మండలం నుండి అజంతుల్లాఖాన్ మంగళవారం నూతనంగా డీటీగా బాధ్యతలు చేపట్టారు. చిట్టమూరు మండలం నుండి నూతనంగా ఆర్ఐగా మధులత శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన మండల సర్వేయర్ రామ్ కుమార్ నెల్లూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నూతనంగా గోపిరెడ్డి ఓజిలి మండలం నుండి బదిలీ నేపథ్యంలో కోటలో శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.

హామీలపై దృష్టి పెట్టాలి: చింతా మోహన్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వెంకన్న లడ్డూపై రాజకీయం చేయడం మాని గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టి సారించాలని మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ హితవు పలికారు. ఎన్నికల హామీలు, వెంకన్న లడ్డు అంశాలపై చింతా మోహన్ మంగళవారం శ్రీకాళహస్తిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ రూ.700కు లభించే లీటర్ స్వచ్ఛమైన ఆవు నెయ్యిని రూ.320కే టెండర్ ద్వారా టిడిపి కొనుగోలు చేసిందంటేనే అది కల్తీ నెయ్యని ఎవరికైనా అర్థమైపోతుందన్నారు. ఇప్పటికే ఈ అంశంపై చంద్రబాబుకు సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిందనీ, ఇకనైనా లడ్డు రాజకీయం మాని ఎన్నికల హామీల అమలుపై దృష్టి సారిం చారని సూచించారు. రాష్ట్రంలోని మహిళలను ఉచిత బస్సు ఎప్పుడు ఎక్కిస్తావని ప్రశ్నించారు.

ముగిసిన జాతీయ సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్: అంతర్జాతీయ అనువాద దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలోని అనువాద విభాగం ద్వారా ట్రాన్సలేషన్ టెక్నిక్స్ అండ్ ఛాలెంజస్ అనే అంశంపై జరుగుతున్న రెండురోజుల జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాణీ సదాశివమూర్తి విచ్చేసి అనువాదం చేయడానికి కావల్సిన టెక్నిక్స్, భాషా పరిజ్ఞానం, కొన్ని రకాల సాహిత్య ప్రక్రియలో ఉన్న అంశాలను ఏ విధంగా ఇతర భాషల్లోకి, ఆ భాషలలో వున్న సౌందర్యాన్ని ఉట్టిపడేలా అనువాదం ఏవిధంగా చేయాలో వివరించారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో 24 విభాగాలు ఉన్నాయని, ఆ విభాగాలు అన్నీ కూడా అనువాద విభాగంతో చక్కటి పురోగతి లభిస్తుందని వివరించారు. విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్‌జె రమాశ్రీ, హైదరాబాద్ యూనివర్సిటీ తెలుగు విభాగం ఆచార్యురాలు ప్రొఫెసర్ డి విజయలక్ష్మి, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంత శుక్లా, సాహిత్య విభాగం వరిష్టాచార్యులు ప్రొఫెసర్ సత్యనారాయ ణాచార్య, సదస్సు కోఆర్డినేటర్స్ డాక్టర్ ఎంజి.నందనరావు, డాక్టర్ కనపాల కుమార్, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని పరిరక్షించండి..

ప్రజాశక్తి - క్యాంపస్ : మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణ రెడ్డి పేర్కొన్నారు. స్వచ్ఛత హీ సేవ లో భాగంగా ఒక చెట్టు తల్లి పేరుతో తిరుపతి ఎన్‌సిసి క్యాడెట్లు మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛ భారత్ అభియాన్ లో భాగంగా క్యాడెట్స్ "స్వచ్ఛత హీ సేవ" అనే మహత్తర కార్యక్రమాన్ని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి అభివృద్ధికి తమ వంతు సహకారం అందించడం, ఎన్సీసీ క్యాడెట్స్ తమ తల్లితో కలిసి, తాము చదువుతున్న కళాశాలలో మొక్కలు నాటడం ద్వారా పచ్చదనాన్ని విస్తరింపచేసే కాకుండా, తల్లుల పట్ల కృతజ్ఞతను వ్యక్తపరుస్తున్నారు. ప్రతి మొక్క తల్లి ప్రేమకు ప్రతీకగా పెంచి, సంరక్షణ చేయాలని క్యాడెట్స్ కృతనిశ్చయంతో ముందుకెళుతున్నారు. ఈ కార్యక్రమం ద్వారా పర్యావరణ రక్షణపై అవగాహన పెరిగి, సామాజిక బాధ్యతను అందరూ అనుసరించాల్సిన అవసరం ఉందని సందేశం ఇచ్చారు. ఎన్సీసీ క్యాడెట్స్ చేపట్టిన ఈ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణలో వారి బాధ్యతను నిలిపే ఉదాహరణగా నిలిచింది. మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా సర్వసాధారణ కర్తవ్యం అని వారు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఎస్ వి ప్రభుత్వ పాలిటెక్నిక్ నుంచి శ్రీ వెంకటేశ్వర రాంనారాయణ్ రుయా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వరకు ఎన్ సిసి క్యాడెట్లచే ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఉదయ్ కుమార్, ఎన్సీసీ బృందం, మేజర్ లోగనాథన్, బి గోవిందరావు, జి బాలకృష్ణ, బావాజీ, శ్రీధర్, అజయ్ పాల్గొన్నారు.

ఉద్యోగ నైపుణ్యాలపై వర్క్ షాప్

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి బైరాగిపట్టెడలోని కొండా రెడ్డి రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ అఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ సైన్సెస్ నూతన మాస్టర్ అఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, మాస్టర్ అఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ విద్యార్థులకు పది రోజుల ఉద్యోగ నైపుణ్య నైపుణ్యాల పై వర్క్‌షాప్ నిర్వహించారు. దీనిలో భాగంగా ' వ్యక్తిత్వ వికాసం, సాఫ్ట్ స్కిల్స్, ఆంగ్ల భాషా భావ వ్యక్తీకరణ, లక్ష్య సాధన, నాయకత్వం' వంటి అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె ప్రకాష్ రెడ్డి తెలిపారు. తిరుపతి 'కౌటిల్య ఇన్‌స్టిట్యూషన్' కంపెని నిపుణులచే నిర్వహిస్తున్నారు. ముఖ్య అతిథిగా కౌటిల్య డైరెక్టర్ శ్రీధర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ఛైర్మన్ వై కొండారెడ్డి, డైరెక్టర్ లు వైఆనంద రెడ్డి, వై విజయ రెడ్డి, విభాగాధిపతులు డాక్టర్ పి నిరంజన్ రెడ్డి, పి మధుర, అధ్యాపకులు, తల్లిదండ్రులు, కౌటిల్య సీనియర్ మేనేజర్ ఎన్ఎస్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయండి

- మా భూములకు పూర్తి నష్ట పరిహారం ఇవ్వండి
- తహశీల్దారుకు బాధితుల వినతి

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలంలోని జగనన్న కాలనీ నిర్మాణానికి రైతుల వద్ద తీసుకున్న భూములకు తగిన నష్టపరిహారం అందించలేదని బాధిత రైతులు తహశీల్దారు భార్గవికి సిఐటియు రైతు కార్మిక సంఘం నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఏర్పేడు మండలంలోని చిందేపల్లి గ్రామ పంచాయతీలోని ప్రభుత్వం 2022లో జగనన్న కాలనీ ఏర్పాటుకు రైతుల నుండి అసైన్‌మెంటు పంట పొలాలను తీసుకుంని, అప్పట్లో ఎకరాకు అన్ని పత్రాలు ఉంటే (డి నమూనా, పాస్ బుక్, ఈ పాస్ బుక్) 14 లక్షల 50 వేల రూపాయలు, ఈ మూడింటిలో ఏ ఒక్కటి లేకున్నా 7 లక్షల 25 వేల రూపాయలు నష్టపరిహారం రైతులకు అందించిందన్నారు. అయితే భూములు ఇచ్చిన ఆ రైతులకి జీవనాధారంగా ఇక ఎలాంటి భూమి లేకపోవడంతో, అప్పటి కలెక్టర్ కి, జెసికి, తహశీల్దారుకి విన్నవించుకోవడంతో అధికారులు స్పందించి పూర్తి నష్టపరిహారం అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి నష్ట పరిహారం అందలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములకు పూర్తి నష్టపరిహారం ఇప్పించాలని మండల తహశీల్దారుకు వినతిపత్రం అందించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రంగయ్య, వెంకటేశ్వర రావు, బాధిత రైతులు పాల్గొన్నారు.

తహశీల్దారుకు వినతి పత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

ప్లాస్టిక్ వ్యర్థాలు బాధ్యతగా సేకరించాలి

దుకాణదారులకు విద్యార్థుల హితవు

ప్రజాశక్తి- సత్యవేడు: ప్లాస్టిక్ వ్యర్థాలను బాధ్యతగా సేకరించాలని దుకాణ దారులకు విద్యార్థులు హితవు పలికారు. సత్యవేడు మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు కళాశాలలోని జాతీయ సేవా విభాగం, ఎన్ఎస్–ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతహి సేవ 2024ను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని విద్యార్థులు సత్యవేడు రైతు భరోసా కేంద్రం, ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ, ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్ర ఆవరణ, పోలీస్ స్టేషన్ ఆవరణ, రోడ్డుపై విసిరేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. దీన్ని అనుసరించి దుకాణ దారులకు ప్లాస్టిక్ వ్యర్థాలను డస్ట్ బిన్ లో పోగు చేయాలని వాటిని వీధుల్లో విసిరివేయకూడదని హితవు పలికారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆనంద్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ పివో హరిప్రసాద్ మాట్లాడుతూ యువత వ్యర్థాల నిర్వహణ విషయంలో బాధ్యతయుతంగా ఉండాలని పెరిగిపోతున్న భూతాపం, వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకొని సమాజ శ్రేయస్సుకు, కాలుష్య నివారణకు పాటు పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శామ్యూల్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రభుత్వ స్థలం ఆక్రమణ

ప్రజాశక్తి-చిట్టమూరు: మండల పరిధిలోని ఆరూరు పంచాయతీలో కూతవేటు దూరంలో ఉన్న సర్వే నంబరు 140లో ఐదు ఎకరాల 60 సెంట్లు ఎర్రానిగుంట వుంది. దాని కింద నీటి పారుదల సుమారు 60 ఎకరాలు ప్రభుత్వం మంజూరు చేసిన సిజెఐఎఫ్ఎస్ భూమి వుంది. ఆ భూమిలో వరి సాగు చేసుకుని కొంతమంది నిరుపేదలు జీవనం సాగిస్తున్నారు. ఎర్రానిగుంట కట్ట కింద 146/1లో రెండు ఎకరాల 30 సెంట్లు మందబైలు భూమి వుంది. దానిపై కన్నేసిన ఓ వ్యక్తి ఆక్రమించుకున్నాడని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాతల ముత్తాతల కాలం నుండి మందబయలుగా ఉన్న ప్రభుత్వ భూములపై కన్ను వేసిన ఆ వ్యక్తి చుట్టు పక్కల భూములను ఆక్రమిస్తున్నాడని గ్రామ ప్రజలు తెలిపారు. రెవెన్యూ అధికారులు స్పందించి మంద బైలు భూములు ఆక్రమణ ఎక్కడ వున్నా అతనిదే అని గ్రామ ప్రజలు పేర్కొంటున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై చర్యలు తీసుకుని రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

చెకుముకి పరీక్షలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు జెడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మండల స్థాయి చెకుముకి పోటీలు మంగళవారం నిర్వ హించారు. జడ్‌పి బాయ్స్ హైస్కూల్ హెడ్ మాస్టర్ భారతి మాటా డుతూ విద్యార్థులకు చిన్ననాటి నుండే సైన్స్ పట్ల అవగాహన కలిగిస్తే భవిష్యత్తులో వారు సమాజాన్ని, మూఢ నమ్మకాలపై అవగాహన కలిగి ముందుకు వెళతారన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, చెంచునారాయణ, పురుషోత్తమరావు, సుబ్బారావు, ప్రభాకర్, సుమన్ రెడ్డి, వివిధ కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భువనేశ్వరి పేర్కొన్నారు. మంగళవారం పుత్తూరు జెడ్‌పి బాలికల ఉన్నత పాఠశాల లో జెవివి ఆధ్వర్యంలో మండల చెకుముకి 'టాలెంట్ టెస్ట్ పరీక్షలు మంగళవారం నిర్వహించారు. ఈ పోటీ పరీక్షలలో 20 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ స్థాయిలలో గెలుపొందిన వారికి జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నారేంద్ర, విజయనాగు, సైన్సు ఉపాధ్యాయులు రమేష్, వేలు, సుధారాణి, షకీలా, సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాయుడుపేటలో

నాయుడుపేట: మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను నాయుడుపేట పట్టణంలోని ఎల్ఎస్ సాగరం జిల్లా పరిషత్ హైస్కూలులో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట మండల రెండవ ఎంఈఓ బి మునిరత్నం, ప్రధానోపాధ్యాయురాలు కె అన్నామణి, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు , ఉపాధ్యాయులు సిహెచ్ కుమార్ పాల్గొన్నారు. ఈ పరీక్షల్లో అర్బన్ నుంచి నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్, జిల్లా పరిషత్ బాయ్స్ హై స్కూల్, రూరల్ నుంచి పుదూరు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల నుంచి రెండు టీంలు జిల్లాస్థాయికి ఎంపికయ్యాయి. పెళ్లకూరు మండలం లో ప్రభుత్వ హైస్కూలులో జరిగిన చెకుముకి మండల స్థాయి పరీక్షల్లో జెడ్పి హై స్కూల్ నెల్లబల్లి, జడ్పీ హైస్కూల్ తాల్వాయిపాడు జిల్లా స్థాయికి ఎంపికయ్యాయి. పై కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్ , బహుమతులు ప్రదానం చేశారు.

తిరుపతి టౌన్: తిరుపతి గ్రామీణ, పట్టణ మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు 2024 మంగళ వారం తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో ఘనంగా జరిగినట్లు జన విజ్ఞాన వేదిక పట్టణ కార్యదర్శి రఫీ తెలిపారు. తిరుపతి పట్టణంలోని 38 స్కూల్స్‌లో సెప్టెంబర్ 25 న జరిగిన పాఠశాల స్థాయి పోటీల్లో ప్రథమ స్థాయిలో వచ్చిన విద్యార్థులు ఈ మండల చెకుముకి సైన్స్ సంబరాల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ సమావేశానికి జేవీవీ పట్టణ అధ్యక్షులు లక్ష్మి నారాయణ అధ్యక్షత వహించారు. డివైఈవో బాలాజీ , ప్రముఖ సేవా సంస్కర్త దామోదరం, సునీరా డాక్టర్ రమేష్ నాథ్ ,లింగుట్ల,ప్రముఖ రచయిత రమేష్, మణికంఠ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: మంగళవారం మండల స్థాయిలో జరిగిన చెకుముకి సైన్స్ సంబరాల్లో సూళ్లూరుపేట, తడ దొరవారిసత్రం మండలాల నుండి 45 పాఠశాలలు పాల్గొన్నాయి. ఒక్కో పాఠశాల నుండి ముగ్గురు విద్యార్థులు చొప్పున 135 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు బహుమతులకు జెవివి గౌరవ అధ్యక్షులు డాక్టర్ పి. ధనంజయలు 5 వేల రూపాయలు విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు చంద్రశేఖర్ పాఠశాల హెచ్‌ఎం.కే.శేఖర్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కే. ప్రభాకర్, జెవివి స్థానిక అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజేష్ బాబు, రామ్మూర్తి,ఉపాధ్యక్షులు శామ్యూల్, కోశాధికారి ఎస్. మస్తాన్, కమిటీ సభ్యులు రామారావు, సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు కే.ఎం.ఎస్. సునీల, సంధ్యారాణి, మాధవి లత,భాస్కర్,బీద సుబ్రహ్మణ్యం,వైవి రమణ,ఎస్.కే హసీనా పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: స్థానిక అంబేద్కర్ భవన్ లో మంగళవారం శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లోని ఆరు మండలాల విద్యార్థులకు మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టును నిర్వహించారు. ఈ పరీక్షలకు 120 మంది విద్యార్థులు హాజరు కాగా 18 మంది జిల్లా పోటీలకు ఎంపికయ్యారు. జేవీవీ కార్యదర్శి బి చెంచయ్య, జెవివి జిల్లా నాయకులు ఎస్ఎం షరీఫ్ పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికే 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి -కోట : రైతుల సమస్యల పరిష్కారానికే కూటమి ప్రభుత్వం 'పొలం పిలుస్తోంది'ని నిర్వహిస్తోందని మండల వ్యవసాయ అధికారి వి నిరంజన్ కుమార్ అన్నారు. కోట మండలంలోని తినిలపూడి వెంకన్నపాలెం పంచాయతీ పరిధిలో 'పొలం పిలుస్తోంది'ని నిర్వహించారు. ఈ సందర్భంగా లాభసాటి వ్యవసాయంపై వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు రైతులను చైతన్యం చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ ప్రతి మండలంలో రైతులతో సమావేశాలు నిర్వహిస్తున్నారన్నారు. డ్రోన్‌తో పంటలపై పురుగు మందుల పిచికారీ విధానం వివరించారు. అనంతరం యంత్ర పరికరాలు, ప్రకృతి వ్యవసాయ సంబంధిత రసాయనాలు, తదితర వాటి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల మత్స్యశాఖ అధికారి వి రెడ్డి నాయక్, వీఏఏ, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని వేడం, రామాపురం పంచాయతీలలో మంగళవారం 'పొలం పిలుస్తోంది'ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏడి రమేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొదట ఏడి రమేష్ రెడ్డి పంచాయతీల పరిధిలోని పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయేది రబీ సీజన్ అని రైతులు అనువైన రకాల పంటలు పండించాలని, ప్రతి రైతు యాజమాన్య పద్ధతులను అనుసరించాలని సూచించారు. ముఖ్యంగా రసాయన ఎరువులకు బదులుగా సేంద్రీయ ఎరువులు ఉపయోగించటం వల్ల పెట్టుబడులు తగ్గటమే కాకుండా పంట దిగుబడి ఎక్కువ అవుతుందన్నారు. సేంద్రియ ఎరువులు వాడకం వల్ల పంట పొలాలు తొందరగా భూసారం కోల్పోకుండా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండల వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి, వీఏఏ బాలు, ఏపీ సిఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం: రాష్ట్రంలోని రైతుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని మండల టిడిపి అధ్యక్షుడు ఎం తిరుమలరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కమ్మ కండ్రిగ పంచాయతీ మిట్టూరులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అధికారిణి స్రవంతి నేతృత్వంలో 'పొలం పిలుస్తోంది'ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు 90 శాతం రాయితీతో డ్రిప్ ఇరిగేషన్, రైతుల కోసం గోకులం షెడ్లను ప్రభుత్వం మంజూరు చేస్తోందని పేర్కొన్నారు. మండల రైతులు సంక్షేమం పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ అధికారిణి స్రవంతి మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను ఉపయోగించి పంట సాగు చేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం పట్ల రైతులు ఎక్కువ మగ్గు చూపాలన్నారు. అనంతరం రైతు పంట పొలాలలో పంటలను పరిశీలించి రైతులకు సూచనలు సలహాలు అందించారు. ఈ సమావేశంలో సి జనార్ధన్ చౌదరి, అర్జున్, కాకర్ల వేణు, కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు శ్రీనివాసులు, జిల్లా డిఆర్‌సి ఏడిఏ భాస్కరయ్య, ఉద్యాన శాఖ అధికారి సునీల్, పశువైద్యులు జయ కిషోర్, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నాయుడుపేట: నాయుడుపేట అగ్రికల్చర్ ఏవో జె గణేష్ ఆధ్వర్యంలో మంగళవారం నాయుడుపేట మండలంలోని కాపులూరు, కూచివాడ గ్రామాలలోని రైతులకు పొలం బాట వ్యవసాయానికి అనుగుణంగా వినియోగంలోకి తేవడం, రసాయన ఎరువుల పై అవగాహన కల్పించారు. తిరుపతి జిల్లాలో ప్రాంతీయ పరిశోధనా సంస్థలో పనిచేస్తున్న టివిఎస్ కేవి ప్రసాద్, కె ఆర్ ఠాగూర్, ప్రధాన శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

దొరవారిసత్రం : మండల పరిధిలో ఏ రైతన్న అయినా 1 ఎకరం విస్తీర్ణంలో కూరగాయలు పండించాలనుకున్న వారికి సబ్సిడీ ధరలో అవసరమైన విత్తనాలు పంపిణీ చేస్తామని మండల వ్యవసాయ అధికారిణి సుభాషిని తెలిపారు. మంగళవారం వ్యవసాయ సాగులో మెలకువలు,అధిక లాభాలు ఆర్జించేందుకు రైతులు పాటించవలసిన సాగు విధానంపై ఏకొల్లు వేణుంబాకం గ్రామంలో ' పొలం పిలుస్తోంది 'ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంహెచ్‌ఓ యామిని, వీఏఏ నరేష్, ఏ కొల్లు రైతులు ముప్పాళ్ళ గోపాల్ రెడ్డి, యాగాని ఆదిముని, యాగాని కృష్ణమూర్తి పలువురు రైతులు హాజరయ్యారు.

ఔషధ రంగంలో ఫంగీల పాత్ర కీలకం : విసి

సదస్సులో పాల్గొన్న ప్రముఖులు

ప్రజాశక్తి - క్యాంపస్ : ఔషధ రంగంలో ఫంగీల పాత్ర కీలకమని ఎస్వీయూ విసి ఆచార్య సిహెచ్ అప్పారావు పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం సూక్ష్మజీవశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు మంగళవారం ఎస్వీయూ సెనేట్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలోనూ అవసర రంగంలోనూ ఫంగీల కీలక పాత్ర వహిస్తున్నాయని వివరించారు. ఇలాంటి అంతర్జాతీయ సదస్సులను పరిశోధకులు, మైక్రోబయాలజిస్టులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జాతీయ సముద్ర శాస్త్ర సంస్థ శాస్త్రవేత్త ప్రొఫెసర్ బెల్లే దామోదర్ మాట్లాడుతూ ఫంగీల విస్తృత సామర్థ్యం గురించి వివరించారు. మైక్రో బయాలజీని ఆధునిక శాస్త్ర, పరిశ్రమలలో ఎలా పఠనం చేయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీలంక యూనివర్సిటీ ప్రొఫెసర్ ఉదెని జయలాల్, డాక్టర్ సృతి వసంతియా, ప్రొఫెసర్ కందికేరా రామయశ్రీధర్, డాక్టర్ సునిల్ ముండ్రా, సదస్సు కన్వీనర్ ఆచార్య సిహెచ్ పరమగీతం, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని పెద్ద పాలు వేడు యానాది కాలనీ ప్రాథమిక పాఠశాల పిల్లలకు పుత్తూరు సంజీవ సింహ ట్రస్ట్ నోటు పుస్తకాలు, ప్యాడ్లు, పెన్సిళ్లు, పెన్నులు మంగళవారం పంపిణీ చేశారు. ముఖ్య అతిథులు ఎంపిడివో త్రివిక్రమరావు, వైద్యాధికారి డాక్టర్ దివాకర్ విద్యాసామగ్రిని అందించారు. ఈ సందర్భంగా సంజీవ సింహ ట్రస్ట్ ఛైర్మన్ డిఎన్ వెంకటేశ్వ ర్లు మాట్లాడుతూ పేద విద్యార్థులకు, వెనుకబడిన విద్యార్థులకు తన వంతు సాయంగా విద్యా సామగ్రిని అందిస్తున్నానని తెలిపారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఎంపిడివో త్రివిక్రమరావు మాట్లాడుతూ అంబేద్కర్ , అబ్దుల్ కలాం, ద్రౌపది ముర్ము వంటి వారిని ఆదర్శంగా తీసుకొని అభివృద్ధి చెందాలని కోరారు. డాక్టర్ దివాకర్ మాట్లాడుతూ పిల్లలందరినీ తల్లిదండ్రులు చదివిం చాలని ఆడపిల్లలను బాధ్యతగా చదివించి అభివృద్ధికి కారకులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్, ఏఎన్‌ఎం సుజలమ్మ, ఆశ వర్కరు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దాత డిఎన్ వెంకటేశ్వర్లు

త్వరలో ఎర్రచందనం దుంగలకు గ్లోబల్ టెండర్లు

ఎర్రచందనం దుంగలను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అడవుల నుండి అక్రమంగా తరలించక పోతూ అధికారులచే సీజ్ చేసిన ఎర్రచందనం దుంగలను త్వరలో గ్లోబల్ టెండర్ల ద్వారా విక్రయాలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలను ప్రారంభించింది. ఇందుకు 900 టన్నుల ఎర్ర చందనం వేలం నిర్వహించబో తున్నారు. ఎర్రచందనం గ్లోబల్ టెండర్ల నిర్వహణ కోసం రాష్ట్ర అటవీ దళాధిపతి ఆర్. కె. సుమన్ నేతృత్వంలో నియమింపబడ్డ ధరల నిర్ణయ కమిటీ తిరుపతి–కరకంబాడి మార్గంలోని ఎర్రచందనం కేంద్రీయ గోదాములను సందర్శించారు. గోదాము లలోని 50 లాట్లలో వున్న ఎర్రచందనం దుంగల గ్రేడ్లు, రంగును ధరల నిర్ణయ కమిటీ రికార్డు చేసింది. గతంలో నిర్వహించిన గ్లోబల్ టెండర్లలో తీసుకున్న ధరల పట్టికను సవరించి ఎర్రచందనం విక్రయాలు ద్వారా మరింత ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. గతంలో ఏ–గ్రేడు 65 నుంచి 75 లక్షలు, బి – గ్రేడు 30 నుంచి 35 లక్షలు, సి – గ్రేడ్ 20 లక్షలు గా గతంలో ధరలను నిర్ణయించారు. గతంలో నిర్ణయించిన ధరలను సవరించాలని యోచనలో రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. ధరల నిర్ణయ కమిటీ పర్యటనలో తిరుపతి సిసిఎఫ్ నాగేశ్వరరావు, జిల్లా అటవీ శాఖ ఇన్చార్జి అధికారి సెల్వం, స్టేట్ సిల్వికల్చరిస్ట్ యశోద భాయ్, కేంద్రీయ ఎర్రచందనం గోదాముల డీఎఫ్ఓ ఎస్ ఎన్ శివకుమార్ పాల్గొన్నారు.

'గాంధీ సిద్ధాంతాలు అనుసరణీయం'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రస్తుత కాలంలో మహాత్మా గాంధీ సిద్ధాంతాలు అనుసరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని స్కిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల అధినేత మిద్దెల హరి అన్నారు. స్థానిక స్కిమ్స్ కళాశాలలో మంగళవారం గాంధీజీ జయంతిని పురస్కరించుకొని ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మిద్దెల హరి మాట్లాడుతూ గాంధీ సత్యం, అహింస, ప్రేమల ఆధారంతో, సత్యాగ్రహం అనే ఆయుధాన్ని స్వాతంత్ర పోరాటానికి ఉపయోగించారని, నిరాడంబరత, నిస్వార్థత మూర్తిభవించిన వ్యక్తి మహాత్మా గాంధీ అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ గీతాదేవి, డైరెక్టర్ కుమార్ పాల్గొన్నారు.

ఎస్‌వియూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆచార్య సుధారాణి

నియామక పత్రం స్వీకరిస్తున్న సుధారాణి

ప్రజాశక్తి -క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ గా ఆచార్య కె. సుధారాణి ని నియమిస్తూ ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు ఉత్తర్వులు అంద జేశారు. ఆచార్య సుధారాణి 1992లో వయోజన విద్యావిభాగంలో లెక్చరర్‌గా చేరి ఆచార్యులుగా ఉద్యోగోన్నతి పొందారు. 32 సంవత్సరాల బోధనానుభవం వున్న వీరిని సీనియారిటీ ప్రాతిపదికన ప్రిన్సిపాల్‌గా విశ్వవిద్యాలయ అధికారులు నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది సహకారంతో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని చెప్పారు.

మహారాజశ్రీ గూడూరు సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

I.P. No.24/2024

గజరావు విజయలక్ష్మి ...పిటిషనర్

వర్సెస్

1. కారుమంచి వెంకటేశ్వర్లు తండ్రి శ్రీనివాసులు నాయుడు
2. కారుమంచి శివపార్వతి భర్త వెంకటేశ్వర్లు
3. పుత్తూరు వెంకటేశ్వర్లు తండ్రి Not Known
4. జడపల్లి వజ్రమ్మ భర్త అంకయ్య
5. అల్లికాసుల కోదండపాణి S/o. Not Known.

యం.వి.నగర్, గూడూరు, All are residing at Nos 1 to 4 గాంధీ నగర్, గూడూరు టౌన్, తిరుపతి జిల్లా ...రెస్పాండెంట్స్

నోటీసు

పై నెంబరు కేసులో పటిషనరు Indigent పర్సన్‌గా కోరియున్నందున నోటీసు నిమిత్తం వాయిదా తేది 25.10.2024దికి వేసియున్నారు. కావున పై తేదిన ఉదయం 10 గం॥లకు పై కోర్టులో హాజరై ఆక్షేపణలున్న యెడల తెలుపకొనవచ్చును. లేని యెడల సదరు విషయమై మీ పరోక్షములో విచారించి తీర్మానించబడును.

ఇట్లు

ఎ.పార్వతయ్య

Advocate for Petitioner